# కపి జాతకం 2

కోతి జేతవనంలో విహారం చేస్తూండగా ఒక చెట్టుకింద భిక్షువులు గుమిగూడి మాట్లాడుకుంటూ కనిపించారు. ఆగి అన్నాడాయన.

"ఆయుష్మాన్, దేని గురించి మీరు చర్చించుకుంటున్నారు."

"భన్తే, జనపదం నుంచి వస్తున్న ఉపాసకులు కొందరు వనంలో దూరంగా ఉన్న చెట్లను నరుకుతున్నారు. ఎండిన తరు వాత వంట కర్రలుగా ఉపయోగించడానికి తీసుకు వెడుతున్నారు. వనం దగ్గిరికి రావొద్దంటే కోపగించుకుంటున్నారు."

శాస్త కూడా కూచున్నాడు. ఆయనకు కొంచెం ఎడంగా, ఎదురుగా శిష్యులు కూచున్నారు. కొన్ని క్షణాలపాటు కళ్లు మూసు కుని, చిరునవ్వుతో కళ్లు తెరిచి అన్నాడాయన.

"భిక్షువులారా, వారు ఇప్పుడే కాదు. మున్ముందు కూడా అడవిని నాశనంచేసి లాభం పొందుతారు. రాజ్యాధికారులు వారికి సహాయం చేస్తారు."

భిక్షువులకు ఆసక్తి పెరిగిపోయింది. అందరూ కలిసి ఆయన్ని వేడుకున్నారు.

"భన్తే వారి భవిష్య కథ వినాలని ఉన్నది."

"సరే."

◆◆◆

పండుకోతి పట్ల ఎందుకో రసూల్‌కి స్నేహభావం ఏర్పడింది. మేరీ రోజిని ఓ ప్లేటు ఇడ్లీ, గ్లాసెడు కాఫీ తాగి తేరుకుని వచ్చి నుంచుంది. అప్రయత్నంగా ఆమె కళ్లు తరచుగా పండుకోతి వేపు చూస్తున్నాయి. సరిగ్గా ఆమె చూసినప్పుడే కోతి గోధుమరంగు కళ్లు తన వేపే నవ్వినట్టనిపిస్తోంది.

"మేరీ, దీన్నిలా ఉండనీ, వీరయ్యని పిలిచి వరసగా ఒక్కోదాన్ని తెచ్చి పడుకోబెట్టమని చెప్పు."

ఒక గంటన్నరసేపు వీరయ్య కోతుల్ని తీసుకురావడం నిర్లిప్తంగా రసూలు ఆపరేషను చెయ్యడం వేగంగా జరిగిపోయింది. మధ్యలో మే.స. చూసినప్పుడల్లా పండుకోతి శత్రుభావంతో చూస్తున్నట్టు అనిపించి కళ్లు మూసుకుంది. ఆరో ఆపరేషను మొదలయ్యేసరికి పండుకోతి 'అయ్యో, అయ్యో' అని వాపోయింది. రసూలు ఆగిపోయాడు. ఏవేందన్నట్టు చూశాడు.

"నీ చేతిలో ఉన్నవాడు నా షడ్డకుడు." అంది పండుకోతి. మే.స.కి కడుపులో అలజడి మొదలై కుప్పకూలిపోడానికి సిద్ధపడి తమాయించుకుంది. కళ్లలో నీళ్లు తిరిగి "ప్రభూ." అనగలిగింది బలహీనంగా.

"రసూలూ, మావాళ్లందర్నీ అడవిలో ఒదిలేస్తే మీ వడియాలూ, ఊరగాయలూ క్షేమంగా ఉంటాయని మీ ఉద్దేశ్యం. అన్నీ మళ్లీ ఒస్తాయి. లోపల ఏం జరుగుతోందో నీకు తెలీదు. నీకు తెలుసా మేరీ?" అంది పండుకోతి.

మే.స. శరీరం గాలిలో ప్లాస్టిక్‌బిందెలా ఒణికిపోయింది. అప్రయత్నంగా ఆమె నోటి వెంట ప్రార్థన వెలువడింది. "ప్రభూ నీ బిడ్డనైన నేను ఈ దినము ఇచటనే నీయందు నిద్రించుటకు సిద్ధముగా యున్నాను. ఇంకా చదువుకొనుచున్న నా బిడ్డల కొరకు నన్ను కాపాడు నాయనా." ఆమె వ్యవహారం చూసి రసూలు చిరాకు పడ్డాడు. ఆమె మూడు గడ్డాలూ చెమటతో తడిసిపోయాయి.

"అసలు విషయం చెప్తాను విను." అంటూ మొదలుపెట్టింది పండుకోతి.

ఎస్.ఐ. వరహాలు ఓరోజు సాయంత్రం అడ్డదారిలో అడవి గ్రామం నుంచి ఒస్తున్నాడు. ఆ నిశ్శబ్దంలో అతని మోటారు సైకిలు తుపాకీ తూట్లలా శబ్దంచేస్తోంది. మలుపు తిరుగుతూ పక్కకి చూశాడతను. కమ్మర రాంబాబు చెట్టుకింద కూచుని ముంతవేపు తదేకంగా చూసుకుంటున్నాడు.

"ఏరా ఏం జేస్తన్నావు?"

రాంబాబు లేచే ప్రయత్నం చేసి కూలబడ్డాడు. వాడి కళ్లు తడిలో గుండ్రంగా తిరుగుతున్నాడు. వినయంగా నవ్వడానికి ప్రయత్నం చేశాడు. స్టేండు వేసి రెండు అంగల్లో దగ్గిరికొచ్చి అలవోకగా చెరువులో చేపని ముక్కుతో పట్టుకున్న కొంగలా చెయ్యిజాచి ముంత ఎత్తేడు వరహాలు. ఎత్తి సగం ఖాళీ చేసి అన్నాడు.

"బావుంది. ఇందులో చెక్కలూ ఏం కలపలేదుగదా లంజొడకా?"

"అయి బాబోయి బాబోయి."

సిగరెట్టు వెలిగించి రాంబాబుకి ఒకటిచ్చాడు.

"ఏంట్రా సంగతులు?"

రాంబాబు సిగరెట్టు వెలిగించి కష్టం మీద రెండు సంగతులు చెప్పేడు. వరహాలు

టైం చూసుకున్నాడు. రాంబాబు చెప్పిన ప్రకారం ఇంకా టైముంది. వెనక్కి తిప్పి మరో అడ్డ దారిలో వెనక్కి వెళ్లి కాలిదారికి అడ్డంగా ఆపేడు మోటారు సైకిలు. ఒక సిగరెట్టు మరో పదిహేను నిముషాలు వెచ్చించిన తరవాత, నలుగురు మనుషులు కావడిలా అటూ ఇటూ బస్తాలు కట్టుకుని వేగంగా వస్తూ వరహాల్ని చూసి ఠక్కున ఆగిపోయారు. నలుగురూ ఒగరుస్తున్నారు. ఒంటిమీద మొలచుట్టూ తువాళ్లు తప్ప ఏవీ లేవు. ఎత్తు నుంచి నడిచి వస్తున్నారేమో ఒళ్లంతా స్నానం చేసినట్టుంది. ఖాకీమనిషిని చూడగానే తల అంటుకుంటున్నట్టయిపోయారు. నోటి చివర్ల ఆరిపోయిన చుట్టముక్కల్ని తీసి దణ్ణం పెట్టి నుంచున్నారు.

"ఏరా అబ్బులూ యాపారం బాగానే సాగుతోంది. ఏటా బస్తా లేటీ?"

"బొగ్గండి. అయిగారూ."

"ఎంత గిడుతోందిరా?"

ఎవరూ మాట్లాడలేదు. కానీ వీళ్లకి మిగిలేదేవీ ఉండదని వరహాలుకి తెలుసు.

'సరేగానీ పైన ఇంకేం చేస్తున్నారు? మంచి పకడ్బందీగా నడుస్తోందంటగా?"

"ఇయేనండి."

"నాకు తెలుసులేరా. ఎదవ కబుర్లు. అంతా మీ రేంజరు దొరగారు నడిపిస్తున్నాడు. అంటే మేం బతికున్నా చచ్చినట్టే లెక్కన్న మాట. మీరూ, మీ రేంజరుగారూ అంతా మీ రాజ్జం నడుస్తోందన్నమాట. సరే. ఎల్లండి."

వాళ్లు వెళ్లలేదు. ఓ నిముషం ఆగి వరహాలే అన్నాడు.

"రేంజరు దొరగార్ని ఓపాలి కలవమనండి మరి. ఆరికి మేం ఎదవల్లా కనిపిస్తున్నాం."

అని సైకిలు తిప్ప వెళ్లిపోయాడు వరహాలు. మెత్తగా నడుస్తున్న యంత్రంలో ఇసక పడ్డట్టయింది. మళ్లీ బస్తాలు లేపే శక్తి నశించింది. నలుగురూ చుట్టలు ముట్టించారు.

రాత్రి ఎనిమిదవుతూండగా రేంజరు జాగ్రత్తగా ఎస్.ఐ. వరహాలుగారి తలుపు తట్టేడు. లుంగీ బనియన్లో వరహాలు స్వయంగా తలుపు తీశాడు. ప్రేమగా, వినయంగా, స్నేహంగా నవ్వి చేతులు జోడించాడు రేంజరు.

"మీరా? ఏటిలా వచ్చేరేటీ?"

"అలగనకండి సార్. బోయినంగాని చెయ్యలేదు గదా?"

"లేదు."

"నా మీద దయుంచి, అలాగే సర్దేసుకుని ఒకపాలి రండి. ప్లీజ్." అయిదు

నిముషాల తరువాత ఇద్దరూ బయల్దేరి ఫారెస్టు బంగ్లావేపు వెళ్లేరు. దార్లో పెట్టె సిగరెట్లు కొన్నాడు రేంజరు. వీళ్లని చూస్తూండగాననే వాచ్‌మెన్ గేటు తీసి దణ్ణం పెట్టి ముందు నడుస్తూ వరండా చివరిగది తాళం తీశాడు. లైటు వేసి తలుపు వేశాడు వాచ్‌మెన్. వెచ్చటి గదిలో టీపాయి మీద విస్కీ సీసా, గ్లాసులూ, పక్కనే స్టీలు కేరియరూ.

"మా కెందుకు బాబూ ఇయన్నీ? ఫారెస్టెవరిదీ? మీదీ మీ డీఎఫ్వో గారిదీ."

సమాధానంగా రేంజరు సిగ్గుపడుతూ నవ్వి గ్లాసులో విస్కీ పోసి వినయంగా ఎదుటి కుర్చీ అంచున కూచున్నాడు.

"కొండకోడి మాంసం సార్. మా వైఫు చేత మీ కోసం ఒండించేను." మొదటి పెగ్గు అవగానే వరహాలు రెండో గ్లాసులో రేంజరు కోసం తనేపోసి, చెప్పమన్నట్టుగా చూశాడు. రేంజరు అతని అటవీ హృదయం విప్పేడు. పైన అడవికొట్టి నిప్పుపెట్టి బొగ్గులు చెయ్యడం ఎప్పట్నించో వస్తోంది. అడపాదడపా టేకు గురించి తమకి తెలీంది గాదు. బొగ్గులో దళారీ ఇచ్చే కక్కుర్తి డబ్బులు తప్ప మిగలడం లేదు.

"గంజాయి?"

"నాలుగైదెకరా వేయించాను. తప్పయిపోయింది. మీకు చెప్పలేదు. లెంపలేసుకుంటున్నాను. మీరెలగంటే అలాగే."

కొండకోడి చాలా రుచిగా ఉంది. వరహాలు మనసు ఎంతో ప్రసన్నంగా ఉంది. విస్కీతో తడిసిన దయతో సమభావంతో పరిష్కార మార్గం చెప్పేడు వరహాలు. బొగ్గుల గొడవతో పనిలేదు. గంజాయి ధర అదరికీ తెలిసిందే. రేంజరు చిన్న మెలిక పెట్టేడు. దళారిని కాపాడతానని మాటిచ్చాడు. ఇదిగాని గుప్పుమంటే మొత్తం లైను లైనంతా నమ్మకం పోతుంది. నమ్మకం మీద మొత్తం జరిగే వ్యాపారం.

"ఓ పన్జెయ్యి. ఆడు బస్సెక్కగానె చెప్పు. దార్లో ఆపి దింపుతాను. నీ గొడవ ఆడికీ ఆడి గొడవ నీకూ తెలవదు. సరిగ్గా మూణ్నెల్ల తరవాత రైడింగు ఏర్పాట చేస్తాను. ఇద్దర్ని పెట్టు అక్కడ. అదవగానే బోటు మార్చు. స్టాకేడబెడుతున్నావు?"

రేంజరు మళ్లీ ఆనందంతో భక్తితో నవ్వి వినయంగా ఓ మాంసం ముక్క నోట్లో పెట్టుకున్నాడు.

"మళ్లీ ఎలాగూ మా వాళ్లు ఊరి మీద పడతారు. రసూలూ ఇదంతా వేస్తు." అంది పండుకోతి. అని సాభిప్రాయంగా మే.స. వేపు చూసింది. ఆమె బొడ్డు ప్రాంతం ఒణికిపోయింది.

◆◆◆

"ఆయుష్మాన్, ఆటవికులు, రాజ్యాధికారులు ఈ ఉపాసకులు." అన్నాడు శాస్త. కథ విన్న భిక్షువు లందరూ శ్రోతాపత్తి ఫలాన్ని పొందేరు.